# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 211 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శనివారం, 04 జులై 2026 | పేజీలు :4




చెట్టు తీసేస్తారా..
చావమంటారా!

2

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో మరింత పురోగతి సాధించాలి

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ, మన చౌరాస్తా :** ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిజమైన అర్హులైన నిరుపేదలకు పక్కా ఇళ్లు అందేలా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై గృహ నిర్మాణ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాకు మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని ఆయా మండలాల వారీగా సమీక్షిస్తూ, గ్రౌండింగ్, స్లాబ్, రూఫ్ స్థాయిలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేలా క్షేత్రస్థాయిలో అధికారులు కృషి చేయాలన్నారు. రెండవ విడత కి సంబంధించి గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు తొలి ప్రాధాన్యతనిస్తూ అర్హులను ఎంపిక చేయాలని తెలిపారు. ఎలాంటి అనర్హులు లబ్ధి పొందకుండా, పూర్తిస్థాయిలో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి, పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేస్తూ గ్రౌండింగ్, బేస్‌మెంట్, రూఫ్ దశల వారీగా పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమమైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో మరింత పురోగతి సాధించేలా సమన్వయంతో పని చేసి లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. నిజమైన పేదలందరికీ గౌరవప్రదమైన నివాసాన్ని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ మాత్రు నాయక్, డిఈలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.



## మట్టి నుంచి మహోన్నతుడు..

పుస్తకాల బడిలో నిశ్శబ్ద అడుగు అతడు..
పేదరికపు నీడలో పెరిగిన వెలుగు అతడు..
కులం అనే గోడలను కూల్చిన తార అతడు..
చదువే శ్వాసగా కదిలిన సైన్యం అతడు..

పాపన్న గౌడ్ నేలపై చిగురించిన మొలక..
పేదరికం, వెనుకబాటుకు పలికెను స్వస్తి..
ఎంబీబీఎస్ దారిన కొత్త ఆరంభం..
మానవత్వానికి ఆయనో రంగుల తిలకం..

అంబేద్కర్ ఆశయాల సంతకం..
పేదవాడి నిశ్శబ్ద దర్పం..
అరుదైన శస్త్రచికిత్సల వెలుగు..
లిమ్కా రికార్డుల పేజీల్లో మెరిసిన పేరు..
తోపుడు బండ్లకు ఊపిరి ఇచ్చిన చేతులు
చిరు వ్యాపారులకు దిక్సూచి..

ఆర్భాటం, అలంకరణలకు దూరం..
సేవలో వెలుగుదీపం..

59వ వసంతంలకి అడుగిడుతున్న
ఓ దళిత రాజా.. డాక్టర్ సుగుణాకర్ రాజా..
నీకు.. జన్మదిన శుభాకాంక్షలు






## వానమ్మా.. రావమ్మా..

**– ముల్కనూర్‌లో శివలింగానికి గ్రామస్తుల అభిషేకం**

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలో సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ గ్రామ మహిళలు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని శివాలయంలో శివలింగానికి జలాభిషేకం చేసి వరుణదేవుడిని ప్రసన్నం చేసుకోవాలని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. అనంతరం గ్రామదేవతల ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు నిర్వహించి, చెరువులు, కుంటలు నిండాలని, భూగర్భ జలాలు పెరగాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ భజనలు, మంగళహారతులతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురిసి గ్రామంలో పంటలు బాగా పండితే రైతుల కష్టాలు తీరుతాయని వారు ఆకాంక్షించారు. పూజా కార్యక్రమంలో గ్రామానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# నీళ్లు ఇవ్వండి.. డ్రైనేజీ మెరుగుపర్చండి..

- **బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరుట్ల దశమంత్ రెడ్డి**



**జనగామ, మన చౌరాస్తా :** పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ నాయకులు శనివారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. పట్టణ అధ్యక్షుడు బొమ్మకంటి అనిల్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరుట్ల దశమంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దశమంత్ రెడ్డి మాట్లాడుతూ, పట్టణ ప్రజలు తాగునీటి సమస్యతో పాటు పలు మౌలిక సదుపాయాల కొరతను ఎదుర్కొంటున్నారని అన్నారు. మున్సిపాలిటీ సరఫరా చేస్తున్న తాగునీటి నాణ్యతను మెరుగుపరిచి స్వచ్ఛమైన నీటిని అందించాలని డిమాండ్ చేశారు. వర్షాకాలంలో మురుగు కాలువలను సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో వర్షపు నీరు నిల్వ ఉండి దోమలు, దుర్వాసనలు పెరుగుతున్నాయని తెలిపారు. కోతులు, వీధికుక్కల సమస్య కూడా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని పేర్కొన్నారు. పట్టణంలో పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచి అన్ని వార్డుల్లో పరిశుభ్రతను మెరుగుపరచాలని కోరారు. బతుకమ్మకుంటకు ప్రతిరోజూ వాకింగ్, వ్యాయామం కోసం పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తున్నందున అక్కడ ప్రవేశ రుసుము వసూలు చేయడం సమంజసం కాదని అన్నారు. ప్రవేశ రుసుమును వెంటనే రద్దు చేసి ప్రజలకు ఉచితంగా అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి మున్సిపల్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు కేవీఎల్ఎన్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజ్ యాదవ్, జిల్లా నాయకుడు వారణాసి పవన్, పట్టణ ప్రధాన కార్యదర్శులు పెదోజు జగదీష్, తోకల హరీష్, జంగ నరసింహారెడ్డి, బింగి రమేష్, సంపత్, గోధుమల అశోక్, కాసుల శ్రీను, మారపాక అనిల్, కార్తీక్, దూసరి శ్రీకృష్ణ, మంగ శ్రీకాంత్, ఉల్లింగుల రాజు, పవన్, పంగ నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# నవ దంపతులకు ఎమ్మెల్యే పల్లా ఆశీర్వాదం

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణంలోని సాయిరాం కన్వెన్షన్‌లో శుక్రవారం నిర్వహించిన పులిగిల్ల శివ యాదవ్ సోదరి శ్రావణి వివాహ వేడుకకు జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నవదంపతులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే, వారి దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# మార్కెట్ యార్డులో చెత్త సాఫ్..

- **తాలు, రాళ్లు తొలగించిన ఏఎంసీ సిబ్బంది**

**జనగామ, మన చౌరాస్తా:** జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో గతంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన పత్తి కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన చెత్తను శనివారం శుభ్రం చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ ఆధ్వర్యంలో ఏఎంసీ సిబ్బంది రాళ్లు, తాలు, ఇతర వ్యర్థాలను తొలగించి యార్డును పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ మాట్లాడుతూ, మార్కెట్ యార్డుకు వచ్చే రైతులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే కమిటీ లక్ష్యమన్నారు. కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి యార్డును పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.



# 'ఎస్ఐఆర్'పై డౌట్స్ వద్దు

- **అంతా అధికారులు చూసుకుంటారు**
- **కాంగ్రెస్ నేత జమాల్ షరీఫ్**

**జనగామ, మన చౌరాస్తా :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్ – స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియపై ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని జనగామ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి, అడ్వకేట్ మహమ్మద్ జమాల్ షరీఫ్ అన్నారు. శుక్రవారం నమాజ్ అనంతరం జనగామ పట్టణంలోని ఏక్ మినార్ మసీదులో ఆయన మాట్లాడారు. ఎస్ఐఆర్ ప్రక్రియ జూన్ 26 నుంచి జులై 25 వరకు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతుందని, బీఎల్‌వోలు, ప్రభుత్వ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఫారాలు అందజేస్తారని తెలిపారు. 2002 ఓటరు జాబితాలో పేరు ఉన్నవారు అదే వివరాలతో ఫారం నింపాలని, పేరు లేని వారు తల్లిదండ్రులు లేదా తాతలు, అమ్మమ్మలు, నానమ్మల పేర్లు 2002 ఓటరు జాబితాలో ఉంటే వాటి వివరాలు నమోదు చేయాలని సూచించారు. 2002 ఓటరు జాబితాలో వివరాలు లేని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం గుర్తించిన 12 రకాల ధ్రువీకరణ పత్రాల్లో ఏదైనా ఒకటి సమర్పిస్తే సరిపోతుందని చెప్పారు. పేరు లేదా చిరునామా సవరణ కోసం ప్రత్యేక కరెక్షన్ ఫారం అందుబాటులో ఉందని, విదేశీ పౌరసత్వం పొందిన వారు ఎస్ఐఆర్ ఫారాలు నింపరాదని పేర్కొన్నారు. ఫారంలో తెలంగాణ రాష్ట్రం పేరును నమోదు చేయడంతో పాటు ఈపీఐసీ (ఓటరు గుర్తింపు) నంబర్‌ను సరిగా నమోదు చేయాలని సూచించారు. ఆధార్, ఓటరు కార్డుతో అనుసంధానమైన మొబైల్ నంబర్‌నే నమోదు చేయాలని, సందేహాలుంటే బీఎల్‌వోలను సంప్రదించాలని తెలిపారు.

# చెట్టు తీసేస్తారా.. చావమంటారా!

- **వేపచెట్టుత నా ఇల్లు దెబ్బతింటోంది..**
- **సమస్య పరిష్కరించకుంటే నిరవధిక దీక్ష**
- **అధికారులకు బాధితుడి వార్నింగ్**

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** మండలంలోని రత్నగిరి గ్రామంలో గ్రామపంచాయతీ ఆవరణలో ఉన్న భారీ వేపచెట్టు కొమ్మలు తన ఇంటిపై విస్తరించి స్లాబ్ దెబ్బతింటోందని గూడూరు రవీందర్ ఆవేదన వ్యక్తం చేశారు. చెట్టు కొమ్మల కారణంగా ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని, ముఖ్యంగా వర్షాకాలంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందని తెలిపారు. ఈ విషయమై గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు మౌఖికంగా, లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. అనంతరం వంగర పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు స్పందించలేదని తెలిపారు. చెట్టును పూర్తిగా తొలగించాలని, లేదంటే కొమ్మలను నరికివేసి తన ఇంటికి రక్షణ కల్పించకుంటే ఈ నెల 6 సోమవారం నుంచి నిరవధిక దీక్ష చేపడతానని రవీందర్ ప్రకటించారు. తన సమస్యను అధికారులు వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారగా, ప్రమాదం సంభవించేలోపు సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.




# థ్యాంక్స్ మేడమ్..

- **కొండా సురేఖను కలిసి డీసీసీ ప్రెసిడెంట్**



**జనగామ, మన చౌరాస్తా:** జనగామ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీనారాయణ లకావత్, టీపీసీసీ సభ్యుడు, యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యునిగా అవకాశం కల్పించినందుకు డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్ మంత్రి కొండా సురేఖకు కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్ట్ బోర్డు సభ్యునిగా ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సేవలు, సౌకర్యాల కల్పనకు అంకితభావంతో పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి చేపడుతున్న చర్యలను అభినందిస్తూ, తనపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని తెలిపారు.

# ‘సర్’ను పరిశీలించిన కాంగ్రెస్ లీడర్లు



**జనగామ, మన చౌరాస్తా :** భారత ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ఓటర్ జాబితా ప్రక్షాళన సర్వే పారదర్శకంగా జరగాలని జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ నాయకులు పలు గ్రామాల్లో సర్వేను పరిశీలించారు. కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామంలోని బూత్ నంబర్ 17, 18 పరిధిలో జరుగుతున్న ఓటర్ సవరణ కార్యక్రమాన్ని జనగామ నియోజకవర్గ కోఆర్డినేటర్లు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మేడ శ్రీనివాస్, 27వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ చెంచారపు కరుణాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ గాదెపాక రామచందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జాతీయ కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి లక్ష్మీనారాయణ నాయక్ మార్గదర్శకత్వంలో సర్ ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు తెలిపారు. కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, మార్పుల సవరణ వంటి అంశాలను ఖచ్చితంగా పరిశీలిస్తూ ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని నాయకులు సూచించారు. తదుపరి ఐనపూర్ గ్రామంలో బీఎల్వో అధికారులతో మాట్లాడి సర్వే పురోగతిని తెలుసుకున్నారు. రసూలాబాద్ గ్రామ పంచాయతీ పరిధిలోని బూత్ నంబర్ 15లో ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఏలు కొమురవెల్లి మండల సుదర్శన్, దండు రమేష్, శ్రీకాంత్, పరహములు, గురువన్నపేట ఇప్ప గణేష్, ఏర్పుల కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు మలం బాలయ్య, చెరుకు రమణారెడ్డి, సంబంధిత బీఎల్వోలు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.



## జర్నలిస్ట్ లక్ష్మణ్‌కు నివాళి

**పాలకుర్తి, మన చౌరాస్తా :** జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన జర్నలిస్ట్ రాపోలు లక్ష్మణ్ చిత్రపటానికి తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమాన్ల తిరుపతిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాపోలు లక్ష్మణ్ కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు బైరు భార్గవ్, మెరుగు మల్లేష్ గౌడ్, కామారపు సునీల్ కుమార్ పాల్గొన్నారు.

## వెల్కమ్ సార్..

**– కొత్త సీఎస్ సంజయ్ జాజుకు టూరిజ ఉద్యోగుల విషెస్**



**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్ర నూతన చీఫ్ సెక్రటరీ (సీఎస్)గా బాధ్యతలు స్వీకరించిన సంజయ్ జాజును తెలంగాణ టూరిజం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం సచివాలయంలోని సీఎస్ చాంబర్‌లో సంజయ్ జాజును కలిసిన సబ్బు రాజమౌళి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగుల సేవా భద్రత, పెండింగ్ సమస్యల పరిష్కారం, సంక్షేమ చర్యలు, సేవా నిబంధనల మెరుగుదలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని సీఎస్ సంజయ్ జాజు హామీ ఇచ్చినట్లు రాజమౌళి తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ తరపున నూతన సీఎస్‌కు మరోసారి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ముల్కనూర్ జీపీలో ఆకస్మిక తనిఖీలు

- **రికార్డులను పరిశీలించిన రాష్ట్ర అధికారులు**




**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామపంచాయతీని పంచాయతీరాజ్ శాఖ రాష్ట్ర డిప్యూటీ కమిషనర్లు జాన్ వెస్లీ, నాగేశ్వరరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, పరిపాలనా విధానాలు, రికార్డుల నిర్వహణను వారు పరిశీలించారు. మండలంలోని గ్రామపంచాయతీలకు కేటాయించిన 15వ ఆర్థిక సంఘం నిధులను ఏయే పనులకు వినియోగించారనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంబంధిత రిజిస్టర్లు, లెక్కలు, తీర్మాన పుస్తకాలు, అభివృద్ధి పనుల వివరాలతో పాటు ఇతర అధికారిక రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. గ్రామపంచాయతీ పరిపాలనలో పారదర్శకత పాటించాలని, ప్రభుత్వ నిధులను నిబంధనలకు అనుగుణంగా వినియోగించాలని అధికారులను ఆదేశించారు. రికార్డుల నిర్వహణలో లోపాలు లేకుండా చూసుకోవడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ ఆదేశాలను సమర్థంగా అమలు చేస్తూ గ్రామాభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. తనిఖీ సందర్భంగా డీపీవోలు లక్ష్మీ రమాకాంత్, రవిబాబు, ఎంపీడీవో వీరేశం, ఎంపీవో నాగరాజు, గ్రామ పంచాయతీ కార్యదర్శి పూర్ణచందర్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ‘నిహీరా కిడ్స్ కేర్’ ఆసుపత్రి ప్రారంభం

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా:** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలో అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన ‘నిహీరా కిడ్స్ కేర్’ 24 గంటల చిన్నారుల ఆసుపత్రిని శుక్రవారం సుధాకర్ మెమోరియల్ నర్సింగ్ హోమ్ వైద్యులు డాక్టర్ తిప్పాని సుధాకర్ ప్రారంభించారు. డాక్టర్ దేశాయ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఆసుపత్రి ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు నగర స్థాయి చిన్నారుల వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా డాక్టర్ తిప్పాని సుధాకర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల కోసం 24 గంటల వైద్య సేవలు అందించే ప్రత్యేక ఆసుపత్రి ఏర్పాటు కావడం అభినందనీయమన్నారు. అత్యవసర పరిస్థితుల్లో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గడంతో పాటు, సకాలంలో చికిత్స అందించి చిన్నారుల ప్రాణాలను కాపాడటంలో ఇలాంటి ఆసుపత్రులు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. నవజాత శిశువుల నుంచి బాల్యదశలోని పిల్లల వరకు అవసరమైన వైద్య సేవలు, అత్యవసర చికిత్స, ఆరోగ్య పరీక్షలు, వైద్య సలహాలు, పర్యవేక్షణ సేవలు ఆసుపత్రిలో 24 గంటలూ అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఆధునిక వైద్య పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్యులు, శిక్షణ పొందిన సిబ్బందితో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముల్కనూర్ గ్రామ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదరి రవీందర్, స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రేపు విరసం ఆవిర్భావ సభ

- **హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వేడుక**

**జనగామ, మన చౌరాస్తా :** విప్లవ రచయితల సంఘం (విరసం) ఆవిర్భావ సభను జులై 5న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా విరసం కన్వీనర్ కోడం కుమారస్వామి తెలిపారు. శుక్రవారం జనగామలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశంలో ప్రజా ఉద్యమాలపై కొనసాగుతున్న నిర్బంధాలు, అణచివేతలకు వ్యతిరేకంగా సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో పోరాటాన్ని కొనసాగించే లక్ష్యంతో ఈ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరిగే సభలో "భారతదేశంలో ఫాసిజం ప్రత్యేకతలు" అంశంపై కవి రివేరా, "బుల్డోజర్ రాజకీయాలు - మత మైనార్టీల అస్తిత్వంపై దాడి" అంశంపై వీక్షణం సంపాదకుడు ఎన్. వేణుగోపాల్, "తెలుగు సాహిత్యంలో ఇటీవలి ధోరణులు - మార్క్సిస్టు దృక్పథం" అంశంపై ప్రొఫెసర్ చింతకింది కాశీం ఉపన్యాసాలు ఇస్తారని తెలిపారు. విరసం కళాబృందం ఆధ్వర్యంలో నాటక ప్రదర్శనతో పాటు వివిధ కళా బృందాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కవులు, రచయితలు, మేధావులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో సభకు హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఎంఈవోకు బీసీటీఏ శుభాకాంక్షలు

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ మండల విద్యాశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ప్రకాశంను బీసీటీఏ బృందం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా బీసీటీఏ జనగామ జిల్లా అధ్యక్షుడు ఎలికట్టే యాదగిరి, ప్రధాన కార్యదర్శి మామిండ్ల అంజయ్య, రాష్ట్ర కార్యదర్శి నీలం వేణు, జిల్లా ఉపాధ్యక్షుడు మండల సుభాష్, సభ్యులు హనుమంతరావు, వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రకాశంకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. విద్యా రంగ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.



# ఎస్ఐఆర్ ప్రక్రియను పక్కగా ఉండాలి

- ప్రతి అర్హ ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారం అందేలా చర్యలు
- బీఎల్ఓలు నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలి
- ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి
- పరిశీలించిన సీఈఓ కార్యాలయ ప్రత్యేక బృందం



**జనగామ, మన చౌరాస్తా :** పారదర్శకంగా ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహించాలని సీఈఓ కార్యాలయ ప్రత్యేక బృందం ప్రతినిధి పద్మావతి అన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (CEO), తెలంగాణ కార్యాలయం నుంచి వచ్చిన ప్రత్యేక బృందం శుక్రవారం, జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (SIR) ప్రక్రియ అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్జీడీసీ పద్మావతి నేతృత్వంలోని ప్రత్యేక బృందం జనగామ పట్టణంలోని పోలింగ్ స్టేషన్ నంబర్లు 254, 259, 270 పరిధులతో పాటు ఘనపూర్ (స్టేషన్) మండలంలోని పోలింగ్ స్టేషన్ నంబర్లు 111, 116 పరిధిలో జరుగుతోన్న ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, ఇంటింటి సర్వే, బీఎల్ఓలు నిర్వహిస్తోన్న విధులు, ఓటర్లకు అందిస్తున్న అవగాహనను పర్యవేక్షించారు. ఈ నేపథ్యంలో బీఎల్ఓలు, సూపర్వైజర్లు ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని బృందం ప్రతినిధి సూచించారు. ప్రతి అర్హ ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారం తప్పనిసరిగా అందేలా చర్యలు తీసుకోవాలని, ఇంటింటికీ వెళ్లి ఓటర్లను వ్యక్తిగతంగా కలిసి ఫారాల పంపిణీ పూర్తి చేయాలని, ఫారాలను సక్రమంగా నింపేలా అవసరమైన అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఓటర్ల వివరాలను నమోదు చేసే సమయంలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత జాగ్రత్తతో వ్యవహరించాలని, ప్రతి వివరాన్ని సంబంధిత ఆధారాలతో ధృవీకరించి నమోదు చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా, అనర్హులు (లేదా) ద్వంద్వ నమోదులు లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. బీఎల్ఓ యాప్‌ను సమర్థవంతంగా వినియోగిస్తూ, క్షేత్రస్థాయి సమాచారాన్ని ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ క్రమంలో ప్రత్యేక బృందం పలు ఇళ్లను సందర్శించి, ఓటర్లతో నేరుగా మాట్లాడి, ఫారాలు అందాయా? సర్వే నిర్వహించారా? వివరాల పూరింపు సక్రమంగా చేశారా? అనే అంశాలపై ఆరా తీశారు. అలాగే ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ అవసరమైన సూచనలు చేశారు. ఈ పరిశీలనలో జనగామ ఈఆర్ఓ, ఆర్డీఓ గోపీరాం, ఏఈఆర్ఓ తహసీల్దార్ మహిపాల్ రెడ్డి, ఘనపూర్ (స్టేషన్) ఈఆర్ఓ, ఆర్డీఓ కిరణ్ ప్రకాష్, ఏఈఆర్ఓ స్వప్న, తదితరులు పాల్గొన్నారు.



## పాదర్శకంగా అవుట్ సోర్సింగ్ నియామకాలు

### పరీక్షలను పరిశీలించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లా స్థాయిలో వివిధ ప్రభుత్వ శాఖల్లో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయనున్న పోస్టుల నియామక ప్రక్రియను పూర్తి పారదర్శకతతో, నిబంధనలకు అనుగుణంగా పరీక్షలు నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా అవుట్ సోర్సింగ్ కమిటీ ఛైర్మన్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన నియామక పరీక్షల సరళిని శుక్రవారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోంతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అర్హులైన అభ్యర్థులకు సమాన అవకాశాలు కల్పించేలా పరీక్షలను నిష్పక్షపాతంగా నిర్వహించడం జరిగిందన్నారు. జూలై 2న వ్యవసాయ శాఖకు సంబంధించిన వ్యవసాయ విస్తరణ అధికారి (AEO) పోస్టుల భర్తీకి ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించామన్నారు. జూలై 3న వైద్య శాఖకు సంబంధించిన ల్యాబ్ టెక్నీషియన్, ఎస్టీఎల్ఎస్ (STLS) పోస్టుల కోసం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించగా, అనంతరం విద్యా శాఖకు సంబంధించిన (TGSWREIS)లో పార్ట్ టైమ్ టీచర్ల పోస్టుల కోసం మధ్యాహ్నం 1 గంటల నుంచి 2.30 గంటల వరకు పరీక్షను నిర్వహించినట్లు స్పష్టం చేశారు. వ్యవసాయ శాఖ - AEO పోస్టులు : 111 మంది దరఖాస్తు చేయగా, 94 మంది పరీక్షకు హాజరయ్యారు. వైద్య శాఖ - ల్యాబ్ టెక్నీషియన్ & STLS పోస్టులు : 100 మంది దరఖాస్తు చేయగా, 75 మంది పరీక్షకు హాజరయ్యారు. సోషల్ వెల్ఫేర్ విద్యా సంస్థల పార్ట్ టైమ్ టీచర్ పోస్టులు: 100 మంది దరఖాస్తు చేయగా, 82 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు.




Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**